E-KABURU
# ఈ-కబురు
E-PAPER
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 09-07-2025 (వారం) బుధవారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com



రేపటి భారత్ బంద్‌లో 25 కోట్ల కార్మికులు? » 3లో
ప్రజా సేవలకు తీవ్ర అంతరాయం?

## పెన్షన్ పథకాలకు పీవోపీలుగా మ్యూచువల్ ఫండ్స్

» 4లో




## స్టోక్స్ ఇదొక కఠిన పరీక్ష.. గిల్ మాత్రం అద్భుతం: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్

» 6లో



## 'కూలీ' రిలీజ్‌కు ముందు శ్రుతీహాసన్ షాకింగ్ నిర్ణయం.. ఇన్‌స్టా పోస్ట్ వైరల్!

» 5లో



## యూపీఐ కొత్త పుంతలు.. స్మార్ట్ డివైజులతో ఆటోమేటిక్‌గా పేమెంట్స్!

» 4లో




## ప్రధాని మోదీకి బ్రెజిల్ అత్యున్నత
# పౌర పురస్కారం

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటులేదు.. ప్రధాని మోదీ



ఈ కబురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరో గౌరవం లభించింది. బ్రెజిల్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా.. 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' పురస్కారాన్ని ప్రదానం చేశారు.అంతకుముందు అక్కడి రియో డి జనీరో నగరంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'బహుళపక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై ప్రసంగించారు. అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీలో కీలకమైన ఖనిజాలను (క్రిటికల్ మినరల్స్) ఏ దేశమూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వాటిని ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు.

తరువాయి 2లో

## సవాల్ విసిరి రాలేదేం?




**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్**

**రాష్ట్రంలో చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు**

**కాంగ్రెస్ అగ్రనేతలకు, బీజేపీ పెద్దలకు మూటలు మోస్తున్నాడని ఆరోపణ**

**ఆయనకు రచ్చ తప్ప చర్చ చేతకాదని తేలిపోయిందని ఎద్దేవా**

**ప్రెస్‌క్లబ్‌లో సీఎంకు ప్రత్యేక కుర్చీ వేసి వేచిచూసిన బీఆర్ఎస్ నేత**

ఈ కబురు, హైదరాబాద్: 'ఆనాటి రోజులు తెస్తామంటూ ఎన్నికల్లో పాటలు రాయించుకున్న కాంగ్రెస్ పార్టీ తిరిగి పాత దుర్దినాలను తీసుకొచ్చింది. ఇందిరమ్మ రాజ్యం పేరిట అక్రమ కేసులు, అణచివేతలు, నిర్బంధాలకు పాల్పడుతోంది. 50 ఏళ్ల క్రితం నాటి ఎమర్జెన్సీ రోజులను తలపించేలా పాలన సాగుతోంది.

తరువాయి 2లో

# యూరియా కోటా పెంచండి..

## జేపీ నడ్డాకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



**మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నడ్డాతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ మల్లు రవి**

**యూరియా సరఫరాపై కేంద్రమంత్రి నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి**

**కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తోనూ భేటీ**

**పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని వినతి**

ఈ కబురు: దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటా పెంచాలని కేంద్ర ఆరోగ్య, సంక్షేమ, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఉన్న సీఎం.. మంగళవారం నడ్డాతో పాటు మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో వేర్వేరుగా వారి అధికారిక నివాసాల్లో భేటీ అయ్యారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆయన వెంట ఉన్నారు. కాగా యూరియా, ఏరో-డిఫెన్స్ కారిడార్, వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సహాయం వంటి అంశాలపై ఇద్దరు మంత్రులతో వేర్వేరుగా సీఎం చర్చించారు.

**రైల్వే రేక్‌లు పెంచండి..**

రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు వచ్చి, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కేంద్ర మంత్రి నడ్డాను రేవంత్ కోరారు. వర్షాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ మాసాల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు.

తరువాయి 2లో

## ప్రతి భూ సమస్యకూ పరిష్కారం



*ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రతి భూ సమస్యకూ పరిష్కారం చూపుతామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంపూర్ణ హక్కులు కల్పించే వరకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.*

» 3లో

# సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

**శ్రీశైలం ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి నీటి విడుదల**

**దిగువకు 1.94 లక్షల క్యూసెక్కుల వరద**

**సాగర్‌లో 171 టీఎంసీలకు చేరిన నిల్వలు..**

**నిండుకుండలా మారిన శ్రీశైలం**



ఈ కబురు, హైదరాబాద్: నాగార్జునసాగర్ జలాశయంలో గంటగంటకు నీటిమట్టం పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో వరద సాగర్ వైపు పరుగులు తీస్తోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి నిలకడగా వరద కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు 1,53,672 క్యూసెక్కుల వరద ఉండగా, జలాశయంలో నీటి నిల్వలు 881 అడుగుల్లో 196.56 టీఎంసీలకు చేరాయి.జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు, గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, నిల్వలు 199 టీఎంసీలకు చేరడంతో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,06,976 క్యూసెక్కుల వరదను కిందకి విడుదల చేశారు. అయితే మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం 1.86 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. నీటి మట్టం 882.2 అడుగులకు పెరిగింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20 వేల క్యూసెక్కులను ఏపీ, కల్వకుర్తి లిఫ్టు ద్వారా తెలంగాణ 1600 క్యూసెక్కులను తరలించుకుంటున్నాయి. మొత్తం 1.94 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి.

**ఎగువ నుంచి స్థిరంగా వరద**

ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది.

# బ్రిక్స్ దేశాలపై 10శాతం టారిఫ్..
## ట్రంప్ సంచలన ప్రకటన



**ఈ కబురు: భారత్‌తో సహా బ్రిక్స్‌లో సభ్యత్వం కలిగిన దేశాలు 10 శాతం సుంకాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అమెరికాను దెబ్బతీసేందుకు, డాలర్ విలువను దిగజార్చేందుకు ఈ కూటమి ఏర్పాటు చేశారని ఆరోపించారు.**

తరువాయి 3లో

## ఉద్యోగ బాట పట్టిన రిషి సునాక్.. ఆ సంస్థలో సీనియర్ సలహాదారుడిగా నియామకం



**ఈ కబురు: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ తన రాజకీయ జీవితానికి తాత్కాలికంగా స్వస్తి పలికి మళ్లీ ఉద్యోగ బాట పట్టారు.**

» 3లో

## సముద్రంలో కలిసే నీటిని
### తెలుగు రాష్ట్రాలు వాడుకోవాలి: ఏపీ సీఎం చంద్రబాబు



**ఈ కబురు, శ్రీశైలం: తన జీవితంలో ఇవాళ చాలా సంతోషకరమైన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణామమని చెప్పారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన అనంతరం ప్రాజెక్టు నాలుగు గేట్లను సీఎం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.**

"శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. మల్లన్న ఆశీస్సులతో రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. జలాలే మన సంపద.. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పైనుంచి వచ్చిన జలాలతో 200 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో ఉంది. రాయలసీమను ఎవరూ కాపాడలేరని గతంలో చాలామంది అన్నారు. సీమ స్థితిగతులు మార్చేందుకు ఎన్టీఆర్ నడుం బిగించారు. రాయలసీమ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నా. సాగునీటి ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. జీడిపల్లికి నీరు తీసుకెళ్లే బాధ్యత మా ప్రభుత్వానిదే.

తరువాయి 2లో

» 3లో

# రూ.303 కోట్లు..
## కంటోన్మెంట్ అభివృద్ధికే





## ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది!

**ఈ కబురు: భారీ వర్షా లు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో హిమాచల్ ప్రదేశ్ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. ఎంతోమంది అయినవాళ్లను కోల్పోయి అనాథలుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది . ఇంతకీ ఏం జరిగిందంటే..?**

హిమాచల్‌లో కురుస్తోన్న భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. అక్కడి సియతి గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు నరేంద్ర మాట్లాడుతూ.. "మా ఇంటి రెండో అంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి.

తరువాయి 3లో



## నీటి విడుదల భారాస విజయమే: హరీశ్‌రావు

» 2లో

మొదటి పేజీ తరువాయి

# యూరియా కోటా పెంచండి.. జేపీ నడ్డాకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి





ఈ కబురు: దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా కోటా పెంచాలని కేంద్ర ఆరోగ్య, సంక్షేమ, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఉన్న సీఎం.. మంగళవారం నడ్డాతో పాటు మరో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో వేర్వేరుగా వారి అధికారిక నివాసాల్లో భేటీ అయ్యారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఆయన వెంట ఉన్నారు. కాగా యూరి యా, ఏరో-డిఫెన్స్ కారిడార్, వరంగల్ విమానాశ్రయా నికి ఆర్థిక సహాయం వంటి అంశాలపై ఇద్దరు మంత్రులతో వేర్వేరుగా సీఎం చర్చించారు.

**రైల్వే రేక్‌లు పెంచండి..**

రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు వచ్చి, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కేంద్ర మంత్రి నడ్డాను రేవంత్ కోరారు. వర్షాకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ మాసాల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గాను కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు.

జూలైలో దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా 63 వేల టన్నులు, విదేశాల నుంచి దిగుమతి అయిన యూరియా 97 వేల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా.. కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేయడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను పెంచాలని కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయండి**

హైదరాబాద్ ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కును తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 'పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తాం. కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలి. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలి. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలి. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలి..'అని కోరారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజబిలిటీపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు.





మొదటి పేజీ తరువాయి

# సవాల్ విసిరి రాలేదేం?




ఈ కబురు, హైదరాబాద్: 'ఆనాటి రోజులు తెస్తామంటూ ఎన్నికల్లో పాటలు రాయించుకున్న కాంగ్రెస్ పార్టీ తిరిగి పాత దుర్దినాలను తీసుకొచ్చింది. ఇందిరమ్మ రాజ్యం పేరిట అక్రమ కేసులు, అణచివేతలు, నిర్బంధాలకు పాల్పడుతోంది. 50 ఏళ్ల క్రితం నాటి ఎమర్జెన్సీ రోజులను తలపించేలా పాలన సాగుతోంది. అరుపులు, గావు కేకలు, బూతులు మాట్లాడటం మినహా రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి చేసిందేమీ లేదు. రాష్ట్ర రైతాంగానికి, యువతకు ఎవరేం చేశారో తేల్చుకుందాం రమ్మని సీఎం విసిరిన సవాలును స్వీకరించి వచ్చాను. నదుల బేసిన్‌లతో సహా ఏ అంశంపైనా రేవంత్‌కు బేసిక్ నాలెడ్జ్ లేదని తెలిసినా ఆయన ముచ్చట పడుతున్నాడని సవాలును స్వీకరించా. ప్రజల సమక్షంలో, మీడియా సాక్షిగా చర్చ కోసం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తే సీఎం ఢిల్లీకి పారిపోయాడు. సీఎంకు వీలుకాని పక్షంలో డిప్యూటీ సీఎం, వ్యవసాయ మంత్రి లేదా ఇతర మంత్రులను ఎవరినైనా చర్చకు పంపుతారని భావించా. కానీ రేవంత్‌కు రచ్చ చేయడం మినహా చర్చ చేయడం రాదని నేటితో తేలిపోయింది..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ఈ నెల 4న ఎల్‌బీ స్టేడియం వేదికగా చేసిన సవాలును స్వీకరిస్తున్నట్లు ప్రకటించిన కేటీఆర్.. మంగళవారం ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. సీఎం కోసం ప్రత్యేక కుర్చీ వేసి పార్టీ నేతలతో కలిసి అరగంట వేచి చూశారు. అనంతరం భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

**అందరూ 'పే సీఎం'అంటున్నారు..**

'రాష్ట్రంలో 18 నెలలుగా అరాచక పాలన సాగుతోంది. రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతులను మోసం చేస్తూ తన గురువు చంద్రబాబునాయుడు కోసం కృష్ణా, గోదావరి జలాలను వదులుతూ బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు పచ్చ జెండా ఊపుతున్నాడు. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణా నీళ్లను దొంగ చాటుగా తీసుకెళ్తుంటే కళ్ళు మూసుకుని చంద్రబాబు చెప్పినట్టు కోవర్టు పాలన సాగిస్తున్నాడు. నీళ్లు ఆంధ్రకు, నిధులు ఢిల్లీకి తరలిస్తున్నాడు. కాంగ్రెస్ అగ్ర నాయకత్వంతో పాటు బీజేపీ పెద్దలకు పైసల మూటలు మోస్తూ పదవిని కాపాడుకుంటున్నాడు. పేమెంట్ కోటాలో పీసీసీ, సీఎం పదవి తెచ్చుకున్న రేవంత్‌ను అందరూ ''పే సీఎం''అంటున్నారు.

**మరో చాన్స్ ఇస్తున్నాం.. తేదీ చెప్పండి**

రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకుని నష్టపోయిన రైతుల జాబితాను తీసుకుని నేను బహిరంగ చర్చ కోసం వస్తే.. తొడగొట్టి సవాలు విసిరిన సీఎం ఎప్పటిలాగానే పారిపోయాడు. ముఖ్యమంత్రికి ఒకవేళ తీరిక లేదనుకుంటే మరో అవకాశం ఇస్తున్నాం. తేదీ, సమయం, వేదిక మీరే చెప్పండి. జూబ్లీహిల్స్‌లోని మీ ప్యాలెస్‌కు అయినా వస్తాం. ఏ అంశం మీద చర్చ పెట్టినా వచ్చేందుకు సిద్ధం మైక్ కట్ చేయకుండా అవకాశం ఇస్తే అసెంబ్లీలో చర్చకు కూడా వస్తాం. ఒకవేళ సీఎం చర్చకు రాకపోతే ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**తెలంగాణ భవన్ నుంచి భారీ కాన్వాయ్‌తో..**

కేటీఆర్ ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ వాహన కాన్వాయ్‌తో ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న కేటీఆర్.. కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు చేసుకున్న 600 మంది అన్నదాతలకు సంతాపం ప్రకటించారు. అనంతరం సీఎం కోసం వేచి చూశారు. 'కేటీఆర్ ఇక్కడ.. రేవంత్ ఎక్కడ?'అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కాగా పోలీసులు మంగళవారం ఉదయం నుంచే తెలంగాణ భవన్, ప్రెస్‌క్లబ్ వద్ద పెద్ద సంఖ్యలో మోహరించారు.

మొదటి పేజీ తరువాయి

# నీటి విడుదల భారాస విజయమే: హరీశ్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: ఎట్టకేలకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయడం భారాస, కేసీఆర్‌ల విజయమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. "భారాస పార్టీ నిలదీస్తే గానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక రాదా? మేం ప్రశ్నిస్తే తప్ప అన్నదాతల నీటి సమస్యలు గుర్తుకు రావా? లక్షల మంది రైతులతో తరలివచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటే గానీ చలనం ఉండదా? ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరదను ఒడిసిపట్టాల్సింది పోయి... విడిచిపెట్టడం దుర్మార్గం. ఇకనైనా రాజకీయ కక్షసాధింపు చర్యలపై కాకుండా రైతులపై దృష్టి సారించండి. కల్వకుర్తి మాదిరే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి, రిజర్వాయర్లు నింపి... పొలాలకు నీళ్లు మళ్లించాలని భారాస పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉపాధి హామీ ఏపీవోలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని మరో ప్రకటనలో ఆయన విమర్శించారు. "చేసిన పనికి వేతనాలు రాక.. ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ.. కుటుంబ పోషణ భారమై సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు సైతం వేతనాలు రాక గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి... ఉపాధి హామీ ఏపీవోలు, పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రధాని మోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారం



ఈ కబురు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరో గౌరవం లభించింది. బ్రెజిల్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా.. 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకుముందు అక్కడి రియో డి జనీరో నగరంలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'బహుళపక్షవాదం, ఆర్థిక వ్యవహారాలు, కృత్రిమ మేధ'పై ప్రసంగించారు. అత్యాధునిక సాంకేతిక సాధనాల తయారీలో కీలకమైన ఖనిజాలను (క్రిటికల్ మినరల్స్) ఏ దేశమూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వాటిని ఇతరులపై ఆయుధాలుగా ఉపయోగించుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. జులై 2న మొదలైన ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటన జులై 9 వరకు కొనసాగనుంది. ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ పర్యటనలను పూర్తిచేసుకున్న మోదీ.. నమీబియాలో అడుగుపెట్టనున్నారు. గడిచిన మూడు దశాబ్దాల్లో ఈ దేశంలో పర్యటించే తొలి భారత ప్రధానిగా నిలవనున్నారు. ఇక ఘనా పర్యటనలో భాగంగా అక్కడి అత్యున్నత పురస్కారం ''ది ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా''తో సత్కరించారు.

**ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటులేదు.. ప్రధాని మోదీ**

బ్రసీలియా: ఉగ్రవాదాన్ని, దానికి మద్దతిచ్చే వారిని భారత్, బ్రెజిల్ లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదని పాకిస్థాన్, చైనాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రెజిల్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఆ దేశ అధ్యక్షుడు లూలా డ సిల్వాతో కలిసి సంయుక్తంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉగ్రవాదంపై ఇండియా, బ్రెజిల్‌లు ఒకేరకంగా ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు.

గత ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రవాద ఘటనపై భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. వీరి సమావేశం నేపథ్యంలో ముందు ఇరు దేశాల నేతల మధ్య పలు కీలక చర్చలు జరిగాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఆరోగ్యం, ఔషధ, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధనం, ఆహారం, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఏఐ& సూపర్ కంప్యూటర్లు, డిజిటల్ సహకారం & మొబిలిటీ రంగాల్లో ఇరుదేశాలు పరస్పరం సహకారం అందించుకోవడానికి వారు మార్గాలను అన్వేషించారని, రానున్న ఐదేళ్లలో ఇరుదేశాల మధ్య 20 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రణధీర్ జైస్వాల్ తెలిపారు. చర్చల అనంతరం ఇరు దేశాల్లో సహకారాన్ని బలోపేతం చేసే పలు ఒప్పందాలు జరిగాయి. అంతకుముందు రియో డి జనీరోలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ చర్చలకు ముందు ప్రధాని మోదీ బ్రెజిల్ అత్యున్నత పౌరపురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదరన్ క్రాస్' పురస్కారాన్ని అందుకున్నారు.



# సముద్రంలో కలిసే నీటిని తెలుగు రాష్ట్రాలు వాడుకోవాలి: ఏపీ సీఎం చంద్రబాబు




ఈ కబురు, శ్రీశైలం: తన జీవితంలో ఇవాళ చాలా సంతోషకరమైన రోజు అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణామమని చెప్పారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన అనంతరం ప్రాజెక్టు నాలుగు గేట్లను సీఎం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

''శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. మల్లన్న ఆశీస్సులతో రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. జలాలే మన సంపద.. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పైనుంచి వచ్చిన జలాలతో 200 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో ఉంది. రాయలసీమను ఎవరూ కాపాడలేరని గతంలో చాలామంది అన్నారు. సీమ స్థితిగతులు మార్చేందుకు ఎన్టీఆర్ నడుం బిగించారు. రాయలసీమ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నా. సాగునీటి ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. జీడిపల్లికి నీరు తీసుకెళ్లే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఈనెల 15 నాటికి ఆ ప్రాంతానికి నీరు రావాలని అధికారులకు టార్గెట్ విధించా. ఈనెల 30 కల్లా కుప్పం, మదనపల్లెకు నీళ్లు తీసుకెళ్తాం. పోతిరెడ్డిపాడు, గాలేరునగరి, గండికోట.. అన్నీ మేమే తెచ్చాం.

తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనేది నా లక్ష్యం. మేం చేసిన అభివృద్ధిని హైదరాబాద్‌లో కొనసాగిస్తున్నారు. సముద్రంలో కలిసే నీటిని తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే మంచిది. దీంతో రెండు రాష్ట్రాల రైతాంగానికి మేలు జరుగుతుంది. రాయలసీమకు నీళ్లు వస్తున్నాయంటే పోలవరం వల్లే. సీమకు ఏమేం చేయాలో నా వద్ద బ్లూప్రింట్ ఉంది. దేశంలో ఎక్కడా లేని రోడ్ల వ్యవస్థ ఈ ప్రాంతంలో ఉంది. గతంలో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు తినేవాళ్లం. పాలిష్డ్ రైస్ తిని చాలామంది షుగర్ వ్యాధి తెచ్చుకుంటున్నారు. ఇప్పుడంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.. చిరుధాన్యాలు తింటున్నారు. కూరగాయలు, పండ్ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అన్ని రకాల పండ్లు పండే ప్రాంతం రాయలసీమ. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక హబ్‌లుగా మారుతున్నాయి''అని చంద్రబాబు అన్నారు.

# సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు



ఈ కబురు, హైదరాబాద్: నాగార్జున సాగర్ జలాశయంలో గంటగంటకు నీటిమట్టం పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో వరద సాగర్ వైపు పరుగులు తీస్తోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి నిలకడగా వరద కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 6 గంటలకు 1,53,672 క్యూసెక్కుల వరద ఉండగా, జలాశయంలో నీటి నిల్వలు 881 అడుగుల్లో 196.56 టీఎంసీలకు చేరాయి. జలాశయం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు, గరిష్ట నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, నిల్వలు 199 టీఎంసీలకు చేరడంతో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ప్రాజెక్టు 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,06,976 క్యూసెక్కుల వరదను కిందకి విడుదల చేశారు. అయితే మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం 1.86 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. నీటి మట్టం 882.2 అడుగులకు పెరిగింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20 వేల క్యూసెక్కులను ఏపీ, కల్వకుర్తి లిఫ్టు ద్వారా తెలంగాణ 1600 క్యూసెక్కులను తరలించుకుంటున్నాయి. మొత్తం 1.94 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి.

**ఎగువ నుంచి స్థిరంగా వరద**

ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.08 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. లక్షా 15 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.14 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.17 లక్షల క్యూసెక్కులు కిందకు వదిలేస్తున్నారు. దాని దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టులోకి 1.25 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు గానూ 7.95 టీఎంసీలను నిల్వ చేస్తూ 1.26 లక్షల క్యూసెక్కులను గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా దిగువకు వదులుతున్నారు. మరోవైపు తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యామ్‌లోకి 52 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. 61 వేల క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. జూరాల, తుంగభద్ర నుంచి విడుదల చేస్తున్న వరద శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో జలాశయం వేగంగా నిండిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్‌కు 1.94 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. నీటిమట్టం 531.9 అడుగులకు చేరింది. సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 171.88 టీఎంసీలకు చేరింది. వరదలు ఇలానే నిలకడగా కొనసాగితే మరోవారం రోజుల్లో సాగర్ నిండే అవకాశం ఉంది.

# శంకర్ గౌడ్ జ్ఞాపకార్థం ఖాజాగూడా పాఠశాలకు బెంచీలు, ఆఫీసు టేబుల్స్ అందజేత



ఖాజాగూడ స్కూల్ కు సామగ్రి అందజేస్తున్న దృశ్యం



శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటుతున్న గంగాధర్ రెడ్డి, సాయిబాబా

**పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు, దివంగత కొమరగౌని శంకర్ గౌడ్ జ్ఞాపకార్థం ఖాజాగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, ఆఫీస్ టేబుల్స్ ను అందజేశారు. దివంగత శంకర్ గౌడ్ కుమారుడు వెంకటేష్ గౌడ్, మనుమడు అఖిల్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఈ సహాయాన్ని అందజేయగా.. మంగళవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకులకు సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో సీనియర్ నాయకుడిగా శంకర్ గౌడ్ చేసిన ప్రజాసేవను గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో శంకర్ గౌడ్ ముందుండి పాల్గొన్నారని అన్నారు. దివంగత శంకర్ గౌడ్ జ్ఞాపకార్థం ఆయన మనుమడు అఖిల్ గౌడ్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమకు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉత్తమంగా రాణించాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడం కేవలం చదువుతోనే సాధ్యమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రథమ ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, శ్యామలా, ఉపాధ్యాయులు నరహరి, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, సుధాకర్, అరుణ్, కిషోర్, నవీన్, ప్రభాకర్, సత్తయ్య, పవిత్రమ్మ, నిర్మలమ్మ, యాదయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి భారత్ బంద్‌లో 25 కోట్ల కార్మికులు? ప్రజా సేవలకు తీవ్ర అంతరాయం?



ఈ కబురు: దేశంలోని బ్యాంకింగ్, భీమా, పోస్టల్ సేవలు మొదలుకొని, బొగ్గు గనుల వరకు వివిధ రంగాలకు చెందిన కార్మికులు బుధవారం(జూలై 9) జరిగే భారత్ బంద్‌లో పాల్గొంటారని ఆయా కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. జూలై 9 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు 10 కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక పిలుపునిచ్చింది.కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, జాతి వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేస్తున్న 'భారత్ బంద్'గా కార్మిక సంఘాలు దీనిని పేర్కొన్నాయి. ఈ సమ్మెను విజయవంతం చేయాలని దేశంలోని కార్మికులకు కార్మిక సంఘాలన్నీ పిలుపునిచ్చాయి. 25 కోట్లకు పైగా కార్మికులు సమ్మెలో పాల్గొంటారని భావిస్తున్నామని, దేశవ్యాప్తంగా రైతులు, గ్రామీణ కార్మికులు కూడా నిరసనలో పాల్గొంటారని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నేత అమర్‌జీత్ కౌర్ మీడియాకు తెలిపారు.'భారత్ బంద్' కారణంగా బ్యాంకింగ్, పోస్టల్, బొగ్గు గనులు, కర్మాగారాలు, రాష్ట్ర రవాణా సేవలు ప్రభావితం కానున్నాయని హింద్ మజ్దూర్ సభకు చెందిన హర్భజన్ సింగ్ సిద్ధూ తెలిపారు. గత ఏడాది కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయకు వివిధ యూనియన్లు సమర్పించిన 17 డిమాండ్లను నెరవేర్చాలంటూ భారత్ బంద్ చేపడుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్లను విస్మరించిందని, గత దశాబ్ద కాలంగా వార్షిక కార్మిక సదస్సును నిర్వహించడంలో విఫలమైందని పలు యూనియన్లు ఆరోపిస్తున్నాయి.ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్‌లు వారి హక్కులను హరించడానికి రూపొందించారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ కోడ్‌లు యూనియన్ కార్యకలాపాలను బలహీనపరచడం, పని గంటలను పెంచడం , కార్మిక చట్టాల ప్రకారం యజమానులను జవాబుదారీతనం నుండి రక్షించడం లక్ష్యంగా పెట్టుకున్నాయని కార్మిక సంఘాలు వాదిస్తున్నాయి. కాగా కార్మిక సంఘాలు గతంలో 2020, నవంబర్ 26న, 2022,మార్చి 28, 29 తేదీలలో, గత ఏడాది ఫిబ్రవరి 16న ఇదేవిధమైన దేశవ్యాప్త సమ్మెలను నిర్వహించాయి.

# రూ.303 కోట్లు.. కంటోన్మెంట్ అభివృద్ధికే



కిషన్‌రెడ్డి లేఖలతో రక్షణ మంత్రి నిర్ణయం

**ఈ కబురు, హైదరాబాద్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని.. కంటోన్మెంట్ అభివృద్ధికే కేటాయించాలని తాను చేసిన విజ్ఞప్తులకు రక్షణ మంత్రి సానుకూలంగా స్పందించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల కోసం కంటోన్మెంట్ భూములను రక్షణ శాఖ హెచ్ఎండీఏకి బదిలీ చేయనుంది. "ఆ భూములకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రూ.303.62 కోట్ల పరిహారం జమ చేయాల్సి ఉంది. ఈ నిధులను కేంద్రానికి కాకుండా కంటోన్మెంట్ ప్రాంతంలో వెచ్చించేందుకు అనుమతివ్వాలని పలుమార్లు రక్షణ మంత్రికి లేఖలు రాశా. దీనికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సానుకూలంగా స్పందించారు. కంటోన్మెంట్ బోర్డుకు అనుబంధంగా ఎస్క్రో ఖాతా తెరచి, ఆ నిధులు కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకే ఉపయోగపడేలా మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాలని ఆదేశాలిచ్చారు" అని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.**

# గచ్చిబౌలిలో సెక్యూరిటీ గార్డు దారుణ హత్య

**నిర్మాణంలో ఉన్న మయూరి భవనంలో ఘటన**



హత్యకు గురైన దాసరి రాజు (ఫైల్)

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో సెక్యూరిటీ గార్డు దారుణ హత్యకు గురయ్యాడు. గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న భారీ బహుళ అంతస్థుల మయూరి నిర్మాణ సంస్థ భవనం సెల్లర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. తలపై ఇనుప రాడ్డుతో మోదీ సెక్యురిటి గార్డును దారుణంగా హత్య చేశారు. ఈ హత్య కేసుకు సంబంధించిన వివరాలు గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం...

గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 90/1లో నిర్మాణంలో ఉన్న మయూరి భారీ బహుళ అంతస్థుల భవనంలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టును మైక్రోన్ సంస్థకు అప్పగించారు. మైక్రోన్ సంస్థ పనులకు కావల్సిన ఎలక్ట్రికల్ వస్తువులను భవనం బేస్మెంట్ 3లో స్టోర్ రూమ్ ఏర్పాటు చేసి భద్రపరిచారు. ఈ స్టోర్ రూమ్ కు నగరంలోని జగద్గిరిగుట్ట లో నివాసం ఉంటున్న దాసరి రాజు (59) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి దాసరి రాజు విధులకు హాజరయ్యాడు. కాగా మంగళవారం ఉదయం 6 గంటలకు సెక్యూరిటీ గార్డ్ రాజు రక్తపు మడుగులో పడి చనిపోయి ఉండడాన్ని భవనంలో ఉన్నవారు గుర్తించారు. స్థానికులు డయల్ 100ద్వారా పోలీసులకు సమాచారం అందించగా గచ్చిబౌలి పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. సెక్యూరిటీ గార్డు రాజు తలపై ఇనుప రాడ్డుతో కొట్టడంతో తీవ్ర గాయమై మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి స్టోర్ రూమ్ లోకి వెళ్లినట్లు గుర్తించారు. సదరు వ్యక్తి ఆటోలో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు గమనించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

# బ్రిక్స్ దేశాలపై 10శాతం టారిఫ్.. ట్రంప్ సంచలన ప్రకటన

ఈ కబురు: భారత్‌తో సహా బ్రిక్స్‌లో సభ్యత్వం కలిగిన దేశాలు 10 శాతం సుంకాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అమెరికాను దెబ్బతీసేందుకు, డాలర్ విలువను దిగజార్చేందుకు ఈ కూటమి ఏర్పాటు చేశారని ఆరోపించారు. బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్‌ను బలహీనపరుస్తున్నాయని, డాలర్‌ను అణగదొక్కాలని చూస్తున్న దేశాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైట్ హౌస్‌లో ట్రంప్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. బ్రిక్స్‌ను అమెరికా ప్రయోజాలకు ముప్పుగా అభివర్ణించారు. 'భారత్ బ్రిక్స్‌లో ఉంటే ఖచ్చితంగా 10 శాతం టారిఫ్ చెల్లించాలి. ఎందుకంటే యూఎస్‌కు హానీతలపెట్టడానికి, డాలర్ విలువను పతనం చేయడానికి స్థాపించారు. వారు తమ ఆట ఆడాలనుకుంటే, నేను కూడా వారి ఆట ఆడగలను. కాబట్టి బ్రిక్స్‌లో ఉన్న ఎవరైనా పది శాతం సుంకాలు చెల్లించాల్సిందే' అని స్పష్టం చేశారు. టారిఫ్‌ల చెల్లింపు ఆగస్టు 1నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఇక గడువు పొడిగింపులు ఉండబోవని తేల్చి చెప్పారు. డాలరే కింగ్ అని మేము దానిని అలాగే ఉంచుతామని తెలిపారు. రాగి దిగుమతులపై 50 శాతం సుంకం రాగి దిగుమతులపై 50 శాతం, ఔషధాలపై 200 శాతం సుంకం విధించబోతున్నట్లు తెలిపారు. దీనిపై త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని, ఏడాది తర్వాత అమల్లోకి వస్తుందన్నారు. దేశీయ పరిశ్రమకు హానీ కలిగించే ప్రతి రంగాన్ని అమెరికా లక్ష్యంగా చేసుకుంటుందని తెలిపారు. రాగి, ఔషధాలతో పాటు మరిన్ని సుంకాలు విధించడానికి దారితీసే కలప, సెమీకండక్టర్లు, కీలకమైన ఖనిజాల దిగుమతులపైనా దృష్టి సారించాలని ఆదేశించారు.

# ప్రతి భూ సమస్యకూ పరిష్కారం

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రతి భూ సమస్యకూ పరిష్కారం చూపుతామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంపూర్ణ హక్కులు కల్పించే వరకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భూ భారతి అమల్లో భాగంగా మూడు విడతలుగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. సదస్సుల అనంతరం క్షేత్ర స్థాయిలో చేపడుతున్న చర్యలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అనుసరిస్తున్న విధానం తదితర అంశాలపై మంగళవారం 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టత ఇచ్చారు.

ఎసైన్డ్ భూములపై ఎలా ముందుకెళ్తారు?

రాష్ట్రంలో ఎసైన్డ్ భూముల సమస్య చాలా తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నియోజకవర్గ స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి ఎసైన్డ్ కమిటీలు ఉండేవి. గత ప్రభుత్వం వాటిని కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టింది. ఈ కమిటీల పునరుద్ధరణకు విధి విధానాల ఖరారుపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

మంత్రి: రైతులను కష్టపెట్టిన ధరణి చట్టాన్ని తొలగించి ఆ స్థానంలో ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం అమల్లో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మూడు విడతల్లో 8.81 లక్షలు వచ్చాయి. పైలట్ ప్రాజెక్టు కింద ఏప్రిల్ మే నెలల మధ్య 34 మండలాల్లో రెండు విడతలుగా సదస్సులు నిర్వహించగా మొత్తం 53 వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 70 శాతం ఇప్పటికే పరిష్కరించాం. సాదాబైనామా, ఎసైన్డ్‌లకు సంబంధించిన సమస్యలు మాత్రమే మిగిలి ఉన్నాయి. న్యాయ స్థానం విచారణలో ఉన్నవి మినహా అన్నింటికీ పరిష్కారం చూపుతాం. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సినవాటిపై దృష్టి పెడతాం. గత ప్రభుత్వం పరిష్కరించలేకపోయిన సమస్యలు భారీగా ఉన్నాయనేది సదస్సులకు వచ్చిన స్పందనను బట్టి అర్థమవుతోంది.

గతంలో దరఖాస్తు చేసుకున్న సాదాబైనామాలను క్రమబద్ధీకరిస్తారా?

ఈ అంశం హైకోర్టు విచారణలో ఉంది. గత ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఆర్వోఆర్ 2020 చట్టంలో క్రమబద్ధీకరణకు సెక్షన్లు మాత్రం చేర్చలేదు. ఆ చట్టం ప్రకారం స్వీకరించినవి మాత్రమే ఆన్‌లైన్ చేశారు. బుధవారం కోర్టు విచారణ జరగనుంది. న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం క్రమబద్ధీకరణపై నిర్ణయం తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఉన్న 2.80 లక్షల్లో 60 శాతం దరఖాస్తులకు సంబంధించి నోటీసులు రూపొందించి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు, బోగస్ పట్టాలు పెట్టి క్రమబద్ధీకరించాలంటూ దరఖాస్తు చేసుకున్నవి ఎట్టి పరిస్థితుల్లో చేయం. కొత్తగా దరఖాస్తుల స్వీకరణపై నిర్ణయం తీసుకోలేదు. 1/70 చట్టం అమల్లో ఉన్న జిల్లాల్లో సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది...?

నిజమే. ఈ జిల్లాల్లో గిరిజన, గిరిజనేతరులకు ఇబ్బందులు ఉన్నాయి. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి.. వచ్చిన సూచనలతో ఎవరికీ ఇబ్బంది కలగకుండా, హద్దుల సమస్యలు రాకుండా పరిష్కారాలు చేపట్టాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

అటవీ రెవెన్యూ సరిహద్దుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

రెండు గ్రామాలు, జిల్లాలు, రాష్ట్రాలతోపాటు శాఖల మధ్య సరిహద్దు సమస్యలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పడిన సమస్యను నేను ప్రత్యక్షంగా చూశా. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సర్వే నంబరు ఒకటి చూపి, మరో చోట ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో సర్వే లేకపోవడంతోనే ఈ సమస్యలు వస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో అధ్యయనం తరువాత రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. మొదటి విడతగా 7,043 మందికి త్వరలో శిక్షణ పూర్తి కానుంది. ఆగస్టులో రెండో విడతగా మూడు వేల మందికి శిక్షణ ఇస్తాం. వీరి సహాయంతో కొత్త చట్టంలో పేర్కొన్నట్లు రిజిస్ట్రేషన్ సందర్భంగా సర్వే పటం జోడించడం తప్పనిసరి చేస్తాం. రాష్ట్రంలో నక్షాలు లేని గ్రామాలు 413 ఉండగా పైలట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాల్లో సర్వే చేపట్టాం. ఖమ్మం జిల్లా ములుగుమాడులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తయింది. ఈ అనుభవంతో మిగిలిన గ్రామాల్లో నక్షాలు రూపొందించే ప్రక్రియ చేపడతాం.



# ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది!



ఈ కబురు: భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో హిమాచల్ ప్రదేశ్ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. ఎంతోమంది అయినవాళ్లను కోల్పోయి అనాథలుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?

హిమాచల్‌లో కురుస్తోన్న భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. అక్కడి సియతి గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు నరేంద్ర మాట్లాడుతూ.. "మా ఇంటి రెండో అంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే కుక్కను కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. ఇంటి చుట్టుపక్కల వాళ్ల ఇళ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో.. మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. పదుల సంఖ్యలో ఇళ్లు దానికింద నేలమట్టం అయ్యాయి. ఒక నాలుగైదు ఇళ్లు మాత్రం దెబ్బతినకుండా కనిపించాయి" అని ఆయన వెల్లడించారు.

ఇళ్లు ధ్వంసం కావడంతో గ్రామస్థులంతా తియంబాలా గ్రామంలోని నైనాదేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. సర్వం కోల్పోవడంతో నైరాశ్యం ఆవరించింది. ఇదిలాఉంటే.. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌ను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. అందులో ఉన్న బంగారం, నగదు ఏమైందో..? అని ఆందోళన వ్యక్తమవుతోంది. దాంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కొట్టుకొనిపోకుండా, దొంగల చేతిలో పడకుండా గ్రామస్థులు కాపలా కాస్తున్నారు. కాగా.. రుతుపవనాల రాకతో జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాలకు హిమాచల్‌లో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురి ఆచూకీ గల్లంతయిందని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన విభాగం వెల్లడించింది. భారత వాతావరణ విభాగం రాష్ట్రంలోని పది జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# ఉద్యోగ బాట పట్టిన రిషి సునాక్.. ఆ సంస్థలో సీనియర్ సలహాదారుడిగా నియామకం

ఈ కబురు: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ తన రాజకీయ జీవితానికి తాత్కాలికంగా స్వస్తి పలికి మళ్లీ ఉద్యోగ బాట పట్టారు. తను మొదట్లో పని చేసిన సంస్థ ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన గోల్డ్‌మన్ శాచ్స్‌లో సీనియర్ సలహాదారుడిగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆ కంపెనీ సీఈఓ గోల్డ్ మన్ శాచ్స్ మంగళవారం వెల్లడించారు. 'గోల్డ్‌మన్ శాచ్స్‌లో రిషిని సీనియర్ సలహాదారుగా స్వాగతించడానికి నేను సంతోషిస్తున్నా. భౌగోళిక రాజకీయ, ఆర్థిక సమస్యలపై తమ క్లయింట్‌లకు సలహా ఇవ్వడానికి సునాక్ గోల్డ్‌మన్ ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి పని చేస్తారు. ఆయన అనుభవం సంస్థకు ఎంతగానో ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గోల్డ్‌మన్ శాచ్స్ బృందాలతో సునాక్ సమయం గడుపుతారని, కంపెనీ మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తారని తెలిపారు.కాగా, భారత సంతతికి చెందిన రిషి సునాక్ 2022 అక్టోబర్ నుంచి 2024 జూలై వరకు బ్రిటన్ ప్రధానమంత్రిగా పని చేశారు. 2024 ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఓటమి తర్వాత ఆయన పీఎం పదవికి, పార్టీ నాయకుడి పదవికి రిజైన్ చేశారు. ప్రస్తుతం రిచ్ మండ్ ఎంపీగానూ కొనసాగున్నా రాజకీయాలకు కాస్త దూరంగా ఉంటున్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఆయన 2001 నుంచి 2004 వరకు గోల్డ్ మన్ శాచ్స్‌లోనే విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలోనే మళ్లీ అదే సంస్థలో సీనియర్ అడ్వైజర్ గా నియామకమవడం గమనార్హం. అయితే గోల్డ్‌మన్ శాచ్స్‌లో సంపాదించిన మొత్తం ఆదాయాన్ని ఆయన భార్య ప్రారంభించిన చారిటీ 'ది రిచ్‌మండ్ ప్రాజెక్ట్'కు విరాళంగా ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.



# ఉద్యోగం పోయిన బాధ ఏఐతో పంచుకోవాలట.. లేఆఫ్‌లపై మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ సలహా




టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఇటీవల భారీ సంఖ్యలో లేఆఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒకేసారి దాదాపు 9000 మందికి నోటీసులిచ్చింది. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఒకరు ఇచ్చిన సలహా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ ఉద్యోగులు బాధ నుంచి బయటపడేందుకు ఏఐ చాట్‌బాట్‌లతో మాట్లాడాలని ఆయన సూచించడం గమనార్హం.లేఆఫ్‌ల ప్రకటన అనంతరం మైక్రోసాఫ్ట్‌లోని ఎక్స్‌బాక్స్ గేమ్ స్టూడియోస్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మాట్ టర్న్‌బుల్ తన లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. ''ఇది చాలా కష్ట సమయం. ఈ లేఆఫ్‌లను మీరు ఎదుర్కోవాలన్నా.. దాన్నుంచి బయటపడి ముందుకుసాగాలన్నా మీరు ఒంటరిగా లేరన్న విషయాన్ని మర్చిపోకండి. ఉద్యోగం కోల్పోయిన బాధలో ఉన్నవారికి ఊరట కలిగించేలా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఏఐ టూల్స్ ఎలా పనిచేస్తాయన్న విషయంపై నేను పరిశోధనలు చేస్తున్నా. చాట్‌జీపీటీ, మైక్రోసాఫ్ట్ కోపైలట్ వంటి ఏఐ టూల్స్ మీకు ఈ విషయంలో మెరుగ్గా సాయపడతాయి. మరింత స్పష్టతతో కెరీర్‌లో ముందుకుసాగడానికి మీరు వాటిని ఉపయోగించుకోవచ్చు. మానసిక బాధ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కెరీర్ కోచ్‌లా సలహాలిస్తాయి. మీ రెజ్యూమ్‌ను మెరుగ్గా రాసుకునేందుకు సాయం చేస్తాయి'' అని టర్న్‌బుల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

అయితే, ఈ పోస్ట్‌పై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. కృత్రిమమేధ వల్లే కంపెనీలు లేఆఫ్‌లు చేపడుతున్నప్పుడు.. ఆ బాధను పోగొట్టుకునేందుకు మళ్లీ ఏఐ టూల్స్‌ను వాడాలన్న సలహా సముచితం కాదని పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో టర్న్‌బుల్ ఆ పోస్ట్‌ను తొలగించారు.

మైక్రోసాఫ్ట్ ఇటీవల అత్యధిక కోతలను ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 4 శాతం మందిని అంటే దాదాపు 9,100 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఎక్స్‌బాక్స్, గేమింగ్ డివిజన్లలో ఈ లేఆఫ్‌లు ఇచ్చింది. ఈ ఏడాదిలో కంపెనీ లేఆఫ్‌లు ప్రకటించడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో 1 శాతం మందిని తొలగించిన కంపెనీ.. ఆ తర్వాత మే నెలలో 6 వేల మందిని ఇంటికి పంపించింది. జూన్‌లోనూ 300 మందికి పైగా ఉద్యోగులను తీసేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రొడక్ట్ డెవలపర్లు ఉన్నారు. కంపెనీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ కోతలు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.



# పెన్షన్ పథకాలకు పీవోపీలుగా మ్యూచువల్ ఫండ్స్

**నిబంధనలు సవరించనున్న సెబీ**

**న్యూఢిల్లీ:** అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీలు) లేదా వాటి సబ్సిడరీలు ఎన్‌పీఎస్ మాదిరి పెన్షన్ స్కీమ్‌లకు పాయింట్ ఆఫ్ ప్రెజెన్స్ (పీవోపీ) సేవలు అందించేందే దిశగా సెబీ కీలక ప్రతిపాదన చేసింది. అలాగే, ఏఎంసీలు తాము నిర్వహిస్తున్న ఫండ్స్‌కు సంబంధించి అంతర్జాతీయ డిస్ట్రిబ్యూటర్లు లేదా అడ్వైజర్లుగానూ సేవలు అందించొచ్చన్న ప్రతిపాదన తీసుకొచ్చింది.

ప్రస్తుతం ఏఎంసీలు, వాటి సబ్సిడరీలు తాము నిర్వహిస్తున్న ఫండ్స్‌కు సంబంధించి మాత్రమే నిర్వహణ, అడ్వైజరీ సేవలు అందించేందుకు అనుమతి ఉంది. ఏఎంసీల సబ్సిడరీలు పెన్షన్ ఫండ్ మేనేజర్లుగా రిజిస్టర్ చేసుకోవడం ద్వారా.. పీవోపీ సేవలను ఆఫర్ చేస్తూ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) నుంచి కొంత పరిహారం అందుకోవచ్చని సెబీ తన తాజా ప్రతిపాదనల్లో పేర్కొంది. అయితే, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఏఎంసీలు చూడాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఏఎంసీల సబ్సిడరీలు పెన్షన్ ఫండ్‌కు డైరెక్ట్ ప్లాన్ రూపంలోనే పీవోపీలుగా పనిచేసేందుకు అనుమతి ఉంది. దీనివల్ల పెన్షన్ ఫండ్ అడ్వైజరీ సేవలపై వాటికి ఎలాంటి కమీషన్ లభించడం లేదు. దీంతో సెబీ కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. ఇక అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ సేవలతోపాటు ఇతర సేవలను సైతం ఏఎంసీలు ఆఫర్ చేసేందుకు సెబీ ప్రతిపాదించింది. వీటిపై ఈ నెల 28 వరకు ప్రజాభిప్రాయాలను సెబీ ఆహ్వానించింది.




# రూ.100తో చోటాసిప్!

**బజాజ్ ఫిన్‌సర్వ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ చోటాసిప్‌ను తీసుకువచ్చే ప్రణాళికతో ఉన్నట్టు ప్రకటించింది. ఇందులో సాధ్యా సాధ్యాలను అంచనా వేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ఎండీ గణేష్ మోహన్ తెలిపారు. ఈ దిశగా టెక్నాలజీ పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు.**

**చోటాసిప్ అన్నది ఆసక్తికరమైన చొరవగా గణేష్ మోహన్ పేర్కొన్నారు. తగినంత అధ్యయనం అనంతరం దీన్ని ప్రారంభించేందుకు ఆరు నెలల సమయం తీసుకుంటుందన్నారు. ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్‌లో కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకునేందుకు వీలుగా సెబీ ఈ ఏడాది ఆరంభంలో మైక్రోసిప్‌ను ఆవిష్కరించడం గమనార్హం. ఎస్‌బీఐ, కోటక్ మ్యూచువల్ ఫండ్స్ ఇప్పటికే రూ.100 సిప్‌ను అందిస్తున్నాయి. మిగిలిన మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో అయితే కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.**




# హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రారంభం

**ఎంటైన్ ఇండియాగా ఐవీ రీబ్రాండ్..**
**3,400 మందికి ఉపాధి**

గ్లోబల్ స్పోర్ట్స్, గేమింగ్ లీడర్‌గా ఉన్న ఎంటైన్ సంస్థకు చెందిన టెక్నాలజీ విభాగం ఐవీ అధికారికంగా ఎంటైన్ ఇండియాగా రీబ్రాండ్ అయి హైదరాబాద్‌లో డిజిటల్ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. కొత్త హైదరాబాద్ క్యాంపస్ ఎంటైన్ అంతర్జాతీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారనుందని కంపెనీ పేర్కొంది.ఈ సంస్థలో పని చేసేందుకు హైబ్రిడ్ రోల్స్‌లో 3,400 మంది హైస్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు చోటు కల్పించేలా ఈ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఫెసిలిటీని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఎంటైన్ హైదరాబాద్ క్యాంపస్ ద్వారా గ్లోబల్ టెక్ సేవల్లో 85% పైగా సర్వీసులు అందించడానికి దీన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పింది. ఇందులో సేవలందించే అడ్వాన్స్‌డ్ డొమైన్‌లు కింది విధంగా ఉన్నాయి.

**కృత్రిమ మేధ**
**ప్లాట్ ఫాం ఇంజినీరింగ్**
**రియల్ టైమ్ ట్రేడింగ్ సిస్టమ్స్**
**గ్లోబల్ సస్టెయినబిలిటీ లక్ష్యాలకు అనుగుణంగా హైదరాబాద్ క్యాంపస్‌లోని సదుపాయాలు..**
**స్మార్ట్ లైటింగ్ వ్యవస్థలు**
**ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్లు**
**పర్యావరణహిత నిర్మాణ సామగ్రి**

ఈ రీబ్రాండ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతపై ఎంటైన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అంతిల్ అన్బగన్ మాట్లాడుతూ..'ఎంటైన్ ఇండియా ద్వారా హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ సర్వీసులు అందించబోతున్నందుకు సంతోషంగా ఉంది. ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ భవిష్యత్తును ఇక్కడి నుంచి శక్తివంతం చేయడం గర్వంగా ఉంది' అన్నారు. ఎంటైన్ చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ సాటీ బెన్స్ మాట్లాడుతూ..'తదుపరి తరం వినోద వేదికలను నిర్మించాలనే మా ఆశయానికి భారతదేశం కేంద్రబిందువుగా మారింది. హైదరాబాద్‌లో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయడం ఆ దిశగా కంపెనీ వేసిన సాహసోపేతమైన ముందడుగు' అని అన్నారు.







# '7 ఏళ్లలో ₹5 వేల కోట్ల నష్టం!'.. లింక్డిన్ పోస్ట్‌పై స్పందించిన క్రెడ్ సీఈఓ!

ప్రస్తుత స్టార్టప్ ప్రపంచంలో కునాల్ షా పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. సాధారణ కుటుంబ నేపథ్యంతో నుంచి వచ్చిన ఆయన.. 'క్రెడ్' అనే అతిపెద్ద ఫైనాన్షియల్ యాప్‌ను తీర్చిదిద్దారు. అయితే, కునాల్ షా గురించి లింక్డిన్‌లో పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. 15 ఏళ్ల తన కెరీర్‌లో ఒక్క రూపాయి లాభం చూపని వ్యక్తి ఎలా ఆదర్శం? అంటూ ఓ నెటిజన్ ప్రశ్నించాడు. దీనికి ఆయనే స్వయంగా బదులిచ్చారు.డెలాయిట్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నా ఆదర్ష్ సమలోప్పనన్ ఇటీవల లింక్డిన్ వేదికగా కునాల్ షా గురించి ఓ పోస్ట్ పెట్టారు. ''2010లో ఫ్రీఛార్జ్‌కు కునాల్ సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరించారు. 2015 నాటికి ఆ సంస్థ రూ.35 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రూ.269 కోట్ల నష్టం చవిచూసింది. స్నాప్‌డీల్ దాన్ని రూ.2800 కోట్లకు కొనుగోలు చేసింది. అక్కడకు రెండేళ్లకు రూ.370 కోట్లకు యాక్సిస్ బ్యాంక్ దాన్ని కొనుగోలు చేసింది. షా 2018లో క్రెడ్‌ను స్థాపించారు. ఏడేళ్లలో ఆ కంపెనీ సాధించిన ఆదాయం రూ.4,493 కోట్లు కాగా.. రూ.5215 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. తన 15 ఏళ్ల ఈ ప్రయాణంలో ఒక్క ఆర్థిక సంవత్సరం కూడా లాభదాయకతను నమోదు చేయని వ్యక్తి గురించి సెలబ్రేట్ చేసుకోవడం ఎందుకో?'' అని ఆదర్శ్ పోస్ట్ చేశారు.

ఈ పోస్ట్ తన దృష్టికి రావడంతో కునాల్ షా హుందాగా స్పందించారు. ''మీరు చెప్పింది నిజమే. ఒక్క రూపాయి కూడా సొంత సొమ్మును ఖర్చు చేయకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగిన వేలాది మంది విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. తమ జీవితాలను రిస్క్‌లో పెడుతూ ఆంత్రప్రెన్యూర్‌లుగా మారుతున్న వ్యక్తుల విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. మన జీవితంలోకి ఏఐ ప్రవేశించాక.. ఉద్యోగం చేయడం అనేది మరింత రిస్క్‌తో కూడుకున్న వ్యవహారంగా మారింది. అలాంటి ఈ రోజుల్లో ఉద్యోగాలు చేసే వారితో పాటు ఉద్యోగాలు కల్పించే వారూ ముఖ్యమే'' అంటూ బదులిచ్చారు.

ఈ పోస్ట్‌పై నెటిజన్లు కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఈ చర్చలో కొందరు ఆదర్ష్ వాదనతో ఏకీభవించగా.. మరికొందరు మాత్రం కునాల్ షా వైపు నిలిచారు. ఒక్క రూపాయి కూడా లాభం చూపకుండా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఎలా చూరగొంటారో అంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విజయానికి లాభదాయకత ఒక్కటే కొలమానం కాదు అంటూ మరికొందరు కామెంట్లు పెట్టారు. ఇలాంటి స్టార్టప్ ఆలోచనల నుంచే వాట్సప్, ఫేస్‌బుక్ వంటి పెద్ద పెద్ద కంపెనీలు ఉద్భవించాయని ఆదర్ష్ గుర్తు చేశారు.




# యూపీఐ కొత్త పుంతలు.. స్మార్ట్ డివైజులతో ఆటోమేటిక్‌గా పేమెంట్స్!

కారు పార్క్ చేశాక పార్కింగ్ ఫీజు ఆ కారే స్వయంగా చెల్లించేస్తే? మన చేతికున్న వాచీ సాయంతో మెట్రో టికెట్టు తీసుకునే వెసులుబాటు లభిస్తే? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. రాబోయే రోజుల్లో ఇది సాధ్యం కాబోతోంది! ఆ మేర నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా యూపీఐని మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దుతోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రెడీ వెర్షన్ యూపీఐని సిద్ధం చేస్తోంది. దీనిద్వారా మనిషి అవసరం లేకుండానే ఇంట్లో ఉండే గృహోపకరణాలు, వేరియబుల్స్, కనెక్టెడ్ వెహికల్స్.. వాటంతట అవే చెల్లింపులు చేసేస్తాయి. అంటే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, స్మార్ట్‌వాచ్‌లు కూడా ఇకపై యూపీఐ లావాదేవీలను నిర్వహించగలవన్నమాట!

ప్రస్తుతం మనం ఏదైనా యూపీఐ పేమెంట్ చేయాలంటే మన దగ్గర మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. దానికంటూ యూపీఐ ఐడీ ఉంటుంది. ప్రస్తుతం యూపీఐ సర్కిల్ చెల్లింపుల వ్యవస్థ కూడా కొత్తగా అందుబాటులోకి వచ్చింది. అంటే ఒక యూజర్ బ్యాంక్ ఖాతా నుంచి సెకండరీ యూజర్ కూడా చెల్లింపులు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఆటోపేమెంట్ సదుపాయం కూడా దాదాపు ఇదే కోవలోకి వస్తుంది. ఇప్పుడు ఎన్‌పీఐసీఐ అభివృద్ధి చేస్తున్న కొత్త వ్యవస్థ కూడా మన అవసరం లేకుండా పనిచేస్తుందని 'బిజినెస్ స్టాండర్డ్' ఓ కథనంలో పేర్కొంది.ఆయా డివైజులు కూడా వ్యక్తుల ప్రైమరీ ఖాతాకు అనుసంధానమై ఉంటాయి. వాటికంటూ ప్రత్యేక యూపీఐ ఐడీ కూడా ఉంటుంది. వన్‌టైమ్ అథంటికేషన్ ఆధారంగా ఆయా డివైజులు అనుసంధానం అవుతాయి. ఒకసారి ప్రైమరీ యూజర్ అనుమతి తీసుకున్నాక వ్యక్తి అవసరం లేకుండానే చెల్లింపులు చేస్తాయి. ఈ ఏడాది జరగబోయే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఈ ఐఓటీ రెడీ యూపీఐని ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రస్తుతం నియంత్రణ సంస్థల నుంచి అనుమతుల కోసం ఎన్‌పీసీఐ ఎదురుచూస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. గతంలో ఇదే ఫెస్ట్‌లో యూపీఐ సర్కిల్, భారత్ బిల్‌పే సిస్టమ్, యూపీఐ లైట్ ఎక్స్ వంటి చెల్లింపు వ్యవస్థలను ఎన్‌పీసీఐ పరిచయం చేసింది. ఈసారి మరింత వినూత్న ఆలోచనతో ముందుకొస్తోంది.



# మార్కో హీరో సోషల్ మీడియా ఖాతా హ్యాక్..

ఇటీవల ఎక్కువగా సినీతారల సోషల్ మీడియా ఖాతాలే టార్గెట్ అవుతున్నాయి. కొద్ది రోజుల క్రితమే శృతిహాసన్ ట్విటర్ ఖాతా హ్యాకింగ్ గురైంది. ఆమె ట్విటర్ ఖాతాలో క్రిప్టో కరెన్సీకి సంభందించిన లింక్స్ దర్శనమిచ్చాయి. అయితే తాజాగా మరో హీరో సోషల్ మీడియా ఖాతా హ్యాకింగ్ గురైంది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని అభిమానులను హెచ్చరించారు. ఏదైనా సందేశాలు వస్తే వాటికి రెస్పాండ్ కావొద్దని ఫ్యాన్స్‌కు సూచించారు. ప్రస్తుతం దీనిపై తన టీమ్ సభ్యులు పని చేస్తున్నారని.. అకౌంట్ రికవరీ అయ్యాక తానే అప్‌డేట్ ఇస్తానని అభిమానులకు అలర్ట్ చేశారు. ఈ విషయాన్ని తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా తెలియజేశారు.

మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ గతేడాది మార్కో మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. మోస్ట్ వయొలెంట్‌గా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. దాదాపు రూ.100 కోట్లకు పైగానే వసూళ్లు సాధించింది. అయితే మార్కో చిత్రంలో వయొలెన్స్ విపరీతంగా ఉందని కొందరు విమర్శలు కూడా చేశారు. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన మార్కోను రూ. 30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. ఈ మూవీ సూపర్ హిట్ కావడంతో సీక్వెల్‌గా కూడా ఉంటుందని అభిమానులు భావించినప్పటికీ అలాంటిదేం లేదని ఇటీవలే కొట్టపారేశారు.

## రవితేజ ఫ్యామిలీ నుంచి మరో హీరో..
## ఫస్ట్ లుక్ అదిరిపోయింది




హీరో రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'మారెమ్మ' అనే టైటిల్ ఖరారు చేశారు. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపా బాలు కథానాయిక. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'మారెమ్మ' టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. "పవర్‌ఫుల్ రూరల్ గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'మారెమ్మ'. మాధవ్‌ను ఫెరోషియస్ రగ్డ్ లుక్‌లో ప్రజెంట్ చేస్తున్నారు నాగరాజ్. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కుశాల్ రెడ్డి కందాలా, కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి.




## 'కుమారి 21F' బడ్జెట్‌కు మించి లాభాలు.. రీరిలీజ్ ట్రైలర్ చూశారా?

దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుకుమార్ తొలిసారిగా నిర్మాతగా మారి, కథా కథనాలు అందిస్తూ తెరకెక్కించిన సినిమా 'కుమారి 21 ఎఫ్' .. 2015లో విడుదలైన ఈ చిత్రం జులై 10న రీరిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. రాజ్ తరుణ్ హెబ్బా పటేల్ జంటగా నటించిన ఈ మూవీ అప్పట్లో భారీ విజయాన్ని అందుకుంది. సూర్య ప్రతాప్ పల్నాటి దర్శకత్వం వహించారు. ఈ మూవీకి కథ చాలా బలంగా పనిచేసింది. ఆపై దేవిశ్రీ ప్రసాద్ సంగీతం కీలకంగా మారింది. సుమారు రూ. 10 కోట్లకు పైగా బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 38 కోట్ల వరకు రాబట్టినట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాతగా సుకుమార్‌కు మంచి లాభాలను ఈ చిత్రం తెచ్చిపెట్టింది. ఇంతటి భారీ విజయాన్ని అందుకున్న చిత్రం జులై 10న మరోసారి థియేటర్‌లో విడుదల కానుంది.

# ఆ హీరో నో చెప్పినట్లు నేను చెప్పలేను.. ఎందుకంటే..: విజయ్ దేవరకొండ



తెలుగు సినీ ఇండస్ట్రీలో ఒకరికొకరు సహకారం అందించుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నారని కథానాయకుడు విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కీలక పాత్రలో గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కింగ్డమ్' . భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధం, స్క్రిప్ట్ ఎంపిక తదితర విషయాలపై మాట్లాడారు.

"కింగ్డమ్' టీజర్‌కు వాయిస్ ఓవర్ ఇవ్వాలని ఎన్టీఆర్ అన్నను అడగ్గానే వచ్చి చెప్పారు. ఇలాంటి సాయాల వల్లే స్నేహబంధం మరింత బలపడుతుంది. తెలుగు ఇండస్ట్రీలో ఒకరికొకరు సాయం చేసుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి నా దగ్గరకు రెండు స్క్రిప్ట్‌లతో వచ్చాడు. నేను 'కింగ్డమ్' ఎంచుకున్నా. రెండో కథ ఇటీవల వచ్చిన ఓ సినిమాకు దగ్గరగా ఉందని తెలిసింది. ఆ మూవీ తీసిన నిర్మాతలు నాకు తెలుసు. ఒకవేళ మేము ఆ కథతో మొదలు పెట్టి ఉంటే, వాళ్లకంటే ముందే తీసేవాళ్లం. కానీ, అది నైతికత అనిపించుకోదు"

"ఇండస్ట్రీలో సపోర్ట్ లేకపోతే, ఏదైనా స్క్రిప్ట్ మన దగ్గరకి వచ్చినప్పుడు 'ఇది బాగోలేదు. ఇలాంటి స్క్రిప్ట్ నేను చేయలేను. ఇంకా బాగా మెరుగు పరచాలి' అని చెప్పలేం. ఒకప్పుడు నాకు అంత చొరవ ఉండేది కాదు. అదే ఇండస్ట్రీలో కుటుంబం సపోర్ట్ ఉన్న నా సమకాలీన నటుడికే ఈ అవకాశం వస్తే, వెంటనే ఆ స్క్రిప్ట్ చేయనని నిర్మొహమాటంగా చెబుతాడు. మరోవైపు వాళ్ల నాన్న వచ్చి మరో మూడు నాలుగు నెలలు ఈ స్క్రిప్ట్‌పై పనిచేసి, మెరుగుపరచాలని సూచిస్తాడు. అవసరమైతే ఇద్దరు ముగ్గురు రచయితలను పెట్టిస్తానని అంటాడు. ఈ మధ్య స్క్రిప్ట్‌ల విషయంలో కాస్త కఠినంగా ఉంటున్నా. నా దగ్గరకు వచ్చిన దర్శకులు, నిర్మాతలకు ధైర్యంగా చెప్పగలుగుతున్నా. డబ్బు, దర్శకుడు కెరీర్, అభిమానుల ప్రేమతో నాకు దక్కిన గౌరవం ఇవన్నీ ముఖ్యమని చెబుతున్నా. స్క్రిప్ట్‌తో పూర్తి సంతృప్తి చెందిన తర్వాతే ముందుకు వెళ్తున్నాం. ఇన్నేళ్ల కెరీర్‌లో నేను నేర్చుకున్నది అదే" అని విజయ్ దేవరకొండ అన్నారు.

# 'కూలీ' రిలీజ్‌కు ముందు శ్రుతిహాసన్ షాకింగ్ నిర్ణయం.. పోస్ట్ వైరల్!



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే హీరోయిన్లలో శ్రుతీహాసన్ ఒకరు. సినిమా అప్‌డేట్స్‌తో పాటు తన పర్సనల్ విషయాలను కూడా అభిమానులతో పంచుకుంటుంది. అంతేకాదు తరచు ఫోటోషూట్ చేసి వాటిని ఇన్‌స్టాలో షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ని అలరిస్తుంది. ఇన్‌స్టాలో ఆమెకు 24 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారంటే..ఆమె నెట్టింట ఎంత యాక్టివ్‌గా ఉంటున్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే తాజాగా ఈ బ్యూటీ సంచలన నిర్ణయం తీసుకుంది. కొన్నాళ్ల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుందట. ఈ విషయాన్ని తన ఫాలోవర్స్‌కి తెలియజేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది.

కొన్ని రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి నిశ్శబ్దాన్ని ఆస్వాదించాలనుకుంటున్నట్లు తెలిపింది. అయితే ఇటీవల ఈ అమ్మడు ట్విట్టర్ అకౌంట్ హ్యాక్ అయిన విషయం తెలిసిందే. తన అకౌంట్‌ను రికవరీ చేసుకున్నట్లు వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే ఆమె సోషల్ మీడియాకు బ్రేక్ తీసుకోబోతున్నట్లు ప్రకటించడంతో అంతా షాక్ అవుతున్నారు. శ్రుతీహాసన్ సినిమాల విషయాలకొస్తే.. ప్రస్తుతం రజనీకాంత్ కూలీ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదల కానుంది.



## టాప్' ర్యాంక్‌కు చేరువగా దీప్తి శర్మ

**దుబాయ్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న టి20 సిరీస్‌లో నిలకడగా రాణిస్తున్న భారత స్పిన్నర్ దీప్తి శర్మ... అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరువైంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ఒక స్థానం పురోగతి సాధించి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. గత ఆరేళ్లగా టాప్-10లో కొనసాగుతున్న దీప్తి తన కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్ అందుకునేందుకు దగ్గరగా వచ్చింది. ప్రస్తుతం దీప్తి ఖాతాలో 738 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. 746 పాయింట్లతో పాకిస్తాన్ బౌలర్ సాదియా ఇక్బాల్ నంబర్‌వన్ స్థానంలో ఉంది. ఇంగ్లండ్‌తో మరో రెండు టి20లు జరగాల్సి ఉన్న నేపథ్యంలో దీప్తి శర్మ విశేషంగా రాణిస్తే తదుపరి ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను అందుకునే అవకాశముంది.

**'హండ్రెడ్' టోర్నీకి దూరం**

వచ్చే నెలలో ఇంగ్లండ్‌లో జరిగే 'హండ్రెడ్' టోర్నీ నుంచి దీప్తి శర్మ వైదొలిగింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్, టీమిండియా బిజీ షెడ్యూల్ కారణంగా ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. దీప్తి వైదొలిగిన నేపథ్యంలో ఈసారి 'హండ్రెడ్' టోర్నీలో భారత ప్రాతినిధ్యం ఉండటంలేదు. గత సీజన్ ఫైనల్లో దీప్తి శర్మ చివరి ఓవర్‌లో కొట్టిన సిక్స్‌తో లండన్ స్పిరిట్స్ జట్టు తొలిసారి 'హండ్రెడ్' ట్రోఫీని సొంతం చేసుకోవడం విశేషం. గత సీజన్‌లో లండన్ స్పిరిట్స్ జట్టు దీప్తి శర్మకు 36 వేల పౌండ్లు చెల్లించింది.









# లార్డ్స్ టెస్టు.. అర్షదీప్ ఎంట్రీ! ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు?

ఎడ్జ్‌బాస్టన్‌లో గెలిచి ఊపు మీదున్న టీమ్‌ఇండియా ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా జులై 10న ప్రారంభం కానున్న మ్యాచ్‌లో విజయం కోసం ఇరుజట్లూ తమ వ్యూహాలకు పదునుపెట్టాయి. ఎడ్జ్‌బాస్టన్‌లో ఓడినంత మాత్రాన ఇంగ్లాండ్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రత్యర్థి జట్టు మ్యాచ్‌ను చేజిక్కించుకుంటుంది. భారత జట్టు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తేనే ఆతిథ్య జట్టుపై మరోసారి పైచేయి సాధించగలదు. అయితే, ఇప్పుడు చర్చంతా భారత్ తుది జట్టు గురించే జరుగుతోంది.

**లార్డ్స్ టెస్ట్.. బెన్‌స్టోక్స్‌కు పెద్ద సవాలే: మైకేల్ అథర్టన్**

లార్డ్స్ మైదానం పేస్ బౌలింగ్‌కు అనుకూలిస్తుందనేది జగమెరిగిన సత్యం. కాబట్టి, నలుగురు సీమర్లు, ఒక స్పిన్నర్‌తో భారత్ బరిలోకి దిగే అవకాశాలే మెండుగా ఉన్నట్లు కనబడుతోంది. గత అనుభవాల దృష్ట్యా గంభీర్ గిల్ దీనికే ఓటేసే అవకాశం ఉంది. ఎందుకంటే ఇక్కడ టీమ్‌ఇండియా ఆడిన గత మూడు టెస్టుల్లో రెండింట (2014, 2021) గెలిచింది. అప్పుడు 4+1 కాంబినేషన్‌తో దిగారు. 2018లో ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగిన భారత్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దీంతో టీమ్‌ఇండియా మరోసారి ఇద్దరు స్పిన్నర్లను ఆడించే సాహసం చేయకపోవచ్చు.

**పేసర్లు ఎవరు?**

ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, నలుగురు పూర్తిస్థాయి పేసర్లు, ఒక స్పిన్ ఆల్‌రౌండర్‌తో భారత్ తుది జట్టు కూర్పు ఉండే అవకాశముంది. ఈ లెక్కన పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డికి ఛాన్స్ దక్కడం అనుమానమే. గత మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా తుది జట్టులోకి రావడం ఖాయం. తొలి రెండు టెస్టుల్లో పెద్దగా రాణించలేకపోయిన ప్రసిద్ధ్ కృష్ణపై వేటు వేసి అర్‌ష్‌దీప్ సింగ్ కు అవకాశం ఇవ్వొచ్చు. ఇక, రెండో టెస్టులో అదరగొట్టిన సిరాజ్, ఆకాశ్ దీప్‌లను పక్కనపెట్టే పరిస్థితి లేదు.

ఇంగ్లాండ్‌లో ఆడిన అనుభవం ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మరోసారి ఛాన్స్ దక్కడం పక్కా! ఇక బ్యాటింగ్ విషయానికొస్తే.. ఆరుగురు స్పెషలిస్టు బ్యాటర్లతో బరిలోకి దిగితే యువ ఆటగాళ్లు అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్‌లో ఒకరు ఈ మ్యాచ్‌లో ఆడటం ఖాయం. అదే జరిగితే కరుణ్ నాయర్ మళ్లీ ఆరో స్థానంలోకి రావొచ్చు. ఎప్పటిలాగే జైస్వాల్, రాహుల్ ఓపెనింగ్ చేయనున్నారు. నాలుగో స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తర్వాత రిషభ్ పంత్ వస్తారు. ఒకవేళ నితీశ్‌ను పక్కన పెట్టకూడదు అనుకుంటే.. సుదర్శన్ మరోసారి పెవిలియన్‌కి పరిమితవుతాడు.

**భారత్ తుది జట్టు (అంచనా):**

**యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్‌ష్‌దీప్ సింగ్**



## బూమ్ బూమ్ బుమ్రా

**స్టార్ పేస్ బౌలర్ సుదీర్ఘ సాధన**

**లండన్:** ఇంగ్లండ్‌తో మూడో టెస్టు కోసం భారత టాప్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా సిద్ధమవుతున్నాడు. రేపటి నుంచి ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. పని భారం కారణంగా ఈ సిరీస్‌లో మూడు టెస్టులే ఆడాలని నిర్ణయించుకున్న బుమ్రా బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టుకు దూరమయ్యాడు. ఇప్పుడు తగినంత విరామం తర్వాత పూర్తి ఫిట్‌గా మ్యాచ్‌కు అతను సన్నద్ధమయ్యాడు. టెస్టుకు రెండు రోజుల ముందు మంగళవారం బుమ్రా సుదీర్ఘ సమయం పాటు నెట్స్‌లో శ్రమించాడు. విరామం లేకుండా అతను బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు.

ఆప్షనల్ ప్రాక్టీస్ రోజు కావడంతో ప్రధాన బ్యాటర్లు గిల్, రాహుల్, జైస్వాల్, పంత్‌తో పాటు సుందర్, సిరాజ్, ఆకాశ్‌దీప్ కూడా మంగళవారం సాధన చేయలేదు. దాంతో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, ధ్రువ్ జురేల్‌లకు బుమ్రా బౌలింగ్ చేశాడు. వీరందరినీ తన బౌలింగ్‌తో బుమ్రా ఇబ్బంది పెట్టాడు. ఎలాంటి అసౌకర్యం లేకుండా పూర్తి రనప్‌తో అతను బౌలింగ్ చేశాడు.

నెట్స్‌కు వచ్చీ రాగానే బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌ను అడిగి తనకు కొత్త బంతి మాత్రమే కావాలని ఎంచుకున్న బుమ్రా దాంతో ప్రాక్టీస్ కొనసాగించాడు. 2021లో లార్డ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రివర్స్ స్వింగ్‌తో మూడు కీలక వికెట్లు పడగొట్టిన బుమ్రా భారత్ ఘన విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ సారి లార్డ్స్ పిచ్ పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందని వినిపిస్తున్న నేపథ్యంలో అతను ఎలా చెలరేగుతాడనేది ఆసక్తికరం



# సబలెంకా శ్రమించి...

**వింబుల్డన్ టోర్నీ సెమీస్‌లో బెలారస్ స్టార్**

**2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో విజయం**

**లండన్:** ఈ ఏడాది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్ చేరేందుకు బెలారస్ స్టార్ సబలెంకా మరో విజయం దూరంలో నిలిచింది. ఈ సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న సబలెంకా... అదే జోరును వింబుల్డన్ టోర్నీలోనూ కొనసాగించి ఈ టోర్నీలో మూడోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 4-6, 6-2, 6-4తో ప్రపంచ 104వ ర్యాంకర్ లౌరా సిగెముండ్ (జర్మనీ)పై కష్టపడి గెలిచింది. 2 గంటల 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకాకు 37 ఏళ్ల సిగెముండ్ నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. క్వార్టర్ ఫైనల్ చేరే క్రమంలో ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోని సబలెంకా ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను చేజార్చుకుంది. అయితే రెండో సెట్‌లో తేరుకున్న సబలెంకా మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. సెట్‌ను 6-2తో దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. చివరకు పదో గేమ్‌లో సిగెముండ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా విజయాన్ని ఖరారు చేసుకుంది.

మ్యాచ్ మొత్తంలో రెండు ఏస్‌లు సంధించిన సబలెంకా నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నెట్ వద్దకు 43 సార్లు దూసుకొచ్చి 25 సార్లు పాయింట్లు గెలిచింది. 29 విన్నర్స్ కొట్టిన ఈ బెలారస్ స్టార్ 36 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసింది. 2021, 2023లలో వింబుల్డన్‌లో సెమీఫైనల్ చేరి ఓడిపోయిన సబలెంకా రేపు జరిగే సెమీఫైనల్లో అనిసిమోవాతో ఆడుతుంది.

**తొలిసారి సెమీస్‌లో అనిసిమోవా**

నాలుగోసారి వింబుల్డన్ టోర్నీలో ఆడుతున్న ప్రపంచ 12వ ర్యాంకర్ అనిసిమోవా (అమెరికా) తొలిసారి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అనిసిమోవా 6-1, 7-6 (11/9)తో పావ్లీచెంకోవా (రష్యా)పై నెగ్గింది. 22వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడిన అనిసిమోవా 2019లో ఫ్రెంచ్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరుకుంది.

**అల్‌కరాజ్ అలవోకగా...**

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. కామెరాన్ నోరి (బ్రిటన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-2, 6-3, 6-3తో గెలుపొందాడు. 99 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 13 ఏస్‌లు సంధించి ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. సెమీఫైనల్లో అమెరికా ప్లేయర్, ప్రపంచ ఐదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్‌తో అల్‌కరాజ్ తలపడతాడు. మరో క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్ 6-3, 6-4, 1-6, 7-6 (7/4)తో ఖచనోవ్ (రష్యా)పై గెలిచి తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్‌లో సెమీఫైనల్‌కు చేరాడు.

**గట్టెక్కిన సినెర్**

సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) కి అదృష్టం కలిసొచ్చింది. దిమిత్రోవ్ (బల్గేరియా) తో జరిగిన మ్యాచ్‌లో సినెర్ తొలి రెండు సెట్‌లను 3-6, 5-7తో కోల్పోయాడు. మూడో సెట్‌లో స్కోరు 2-2తో సమంగా ఉన్నపుడు దిమిత్రోవ్ గాయపడ్డాడు. దాంతో దిమిత్రోవ్ ఆటను కొనసాగించలేకపోవడంతో సినెర్‌ను విజేతగా ప్రకటించారు. గత ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో దిమిత్రోవ్ గాయాల కారణంగా వైదొలగడం గమనార్హం.



## రెండో రౌండ్‌లో వంతిక అగర్వాల్

**బతూమి (జార్జియా):** మహిళల ప్రపంచకప్ నాకౌట్ చెస్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వంతిక అగర్వాల్, పద్మిని రౌత్, పీవీ నందిత రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా... కిరణ్ మనీషా మొహంతి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. కె. ప్రియాంక భవిత్యం నేడు జరిగే టైబ్రేక్ గేమ్‌లలో తేలనుంది. తొలి రౌండ్‌లో వంతిక 1.5-0.5తో లాలా షాహోర్ద్‌వా (తుర్క్‌మెనిస్తాన్)పై, పద్మిని 2-0తో జాంగ్ లాన్‌లిన్ (చైనా)పై, నందిత 2-0తో ఒరిట్జ్ అనాహి (ఈక్వెడార్)పై గెలుపొందారు.

కిరణ్ మనీషా 0.5-1.5తో సాంగ్ యుజిన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లోని రెండు గేమ్‌లు ముగిశాక ప్రియాంక-గాల్ జొసోకా (హంగేరి) 1-1తో సమంగా నిలిచారు. షాహోర్ద్‌వాతో ఆదివారం తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న వంతిక సోమవారం జరిగే రెండో గేమ్‌లో 29 ఎత్తుల్లో నెగ్గింది.

జాంగ్ లాన్‌లిన్‌పై తొలి గేమ్‌లో గెలిచిన పద్మిని సోమవారం జరిగిన రెండో గేమ్‌లో 34 ఎత్తుల్లో... అనాహిపై తొలి గేమ్‌లో నెగ్గిన నందిత రెండో గేమ్‌లో 64 ఎత్తుల్లో విజయం అందుకున్నారు. సాంగ్ యుజిన్ చేతిలో తొలి గేమ్‌లో ఓడిపోయిన మనీషా రెండో గేమ్‌ను 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని ఇంటిదారి పట్టింది.

## స్టోక్స్ ఇదొక కఠిన పరీక్ష.. గిల్ మాత్రం అద్భుతం: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్



ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో టీమిండియా చిత్తు చేసిన సంగతి తెలిసిందే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అదరగొట్టిన భారత జట్టు.. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో తమ తొలి టెస్టు విజయాన్ని నమోదు చేసింది.దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 11తో గిల్ సేన సమం చేసింది. ఈ క్రమంలో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఆదేశ మాజీ క్రికెటర్ మైఖేల్ అథర్టన్ విమర్శల వర్షం కురిపించాడు. స్టోక్స్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడని, కెప్టెన్‌గా తన మార్క్ చూపించలేకపోతున్నాడని అథర్టన్ మండిపడ్డాడు. కాగా తొలి టెస్టులో పర్వాలేదనిపించిన స్టోక్స్.. రెండో టెస్టులో మాత్రం పూర్తిగా తేలిపోయాడు. అటు వ్యక్తిగత ప్రదర్శన పరంగా.. ఇటు కెప్టెన్సీలోనూ విఫలమయ్యాడు."ఈ సిరీస్‌కు బెన్ స్టోక్స్‌కు కఠిన పరీక్ష వంటింది. స్టోక్స్ గత కొంత కాలంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. ముఖ్యంగా అతడి బ్యాటింగ్ ఫామ్ జట్టుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రోజు రోజుకు అతడి బ్యాటింగ్ ఫామ్ దిగజారుతూ వస్తోంది.వన్డే, టీ20లకు దూరంగా ఉంటూ స్టోక్స్ కేవలం టెస్టుల్లో ఆడుతూ వన్‌ఫార్మాట్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. అతడు జట్టును ఒక ప్రణాళికపరంగా ముందుకు నడిపించలేకపోతున్నాడు. అతడి పేలవ ఫామ్ కెప్టెన్సీపై ఇంపాక్ట్ చూపుతోంది. అంతేకాకుండా స్పిన్నర్లను ఆడటానికి ఇబ్బంది పడుతున్నాడు.కానీ ప్రత్యర్థి కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మాత్రం అద్భుతంగా రాణిస్తున్నాడు. తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరిస్తునప్పటకి జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. లార్డ్స్‌లో జరగనున్న మూడో టెస్టులో కూడా భారత్ నుంచి ఇంగ్లండ్‌కు గట్టి సవాల్ ఎదురుకానుంది.

ఈ మ్యాచ్‌లో స్టోక్స్ కెప్టెన్‌గా ఎలా రాణిస్తాడన్నది చాలా ముఖ్యంమని" ది టైమ్స్ కాలమ్‌లో అథర్టన్ పేర్కొన్నాడు. కాగా టెస్టుల్లో స్టోక్స్ సెంచరీ చేసి దాదాపు రెండేళ్లు అవుతోంది. ఇక ఇంగ్లండ్‌భారత్ మధ్య మూడో టెస్టు గురువారం నుంచి ప్రారంభం కానుంది.

